ఓం శ్రీసాయిరాం

ప్రేమస్వరూపులారా!

విద్యారంగమందు చెలరేగుతున్న సమస్యలను గురించి అనేకులు విచారించుచున్నారు. కాని, అది ఇంకనూ అయోమయస్థితిలోనే వున్నది. నిత్యజీవితమునకు ప్రయోజనకరముగాను, పుష్టవంతముగను ఉపకరించగల విద్యాభ్యాసక్రమము ఈనాడు అధోముఖముగా పయనించుచున్నది. విద్యార్థులలో ఉద్రేకాలు విజృంభించి ఆదర్శాలన్నీ కుంటువడినవి. నీతినిజాయతీలు, వినయవిధేయతలు, గౌరవమర్యాదలన్నిటినీ మంటకలిపినట్లయినది. ఉత్తమాదర్శములను నిర్వహించే శక్తిసామర్థ్యములు లేక సరస్వతీ నివాసములు కావలసిన విద్యాలయములు, విద్యాసంస్థలు లక్ష్మీనివాసములుగా మారినవి. విద్యాభ్యాసము వికృత స్వరూపము దాల్చినది. గుణసంబంధమైన శిక్షణాక్షేత్రము ధనసంబంధమును పెంచుకొని పాడైనది. విద్యార్జనా పద్ధతిలో మానవత్వమునకు అవసరమైన గుణాభివృద్ధి మచ్చుకైనా కనిపించటంలేదు. ఇది మానవజాతికే ప్రమాదకరమైన పరిస్థితి. జీవితమే ఈనాడు గొంగళీపురుగులు చేరిన రగ్గుపై పరుండినట్లున్నది.

జీవితము రైలుప్రయాణము వంటిది. కొంతమంది ముందు స్టేషన్‌లో దిగిపోతారు. మరికొంతమంది రెండవ స్టేషనులో దిగుతారు. వారికి రైలులో అశాంతి, అనానుకూలములు, అసహ్యములు అనుభవించవలసి వుండిననూ, కొంతకాలమే! దానికి అంత శ్రమ లేదు. అయితే విద్యార్థులది దీర్ఘప్రయాణము. అతి కష్టప్రయాణము. కనుక, వారిని సున్నితముగా జాగ్రత్తతో, సహనంతో, ప్రేమతో చూచుకోవాలి. మానవత్వములోని దివ్యత్వమును అధ్యాపకులు తెలుసుకొని వారికి తెలపాలి. మానవత్వము ఈనాడు విచిత్ర మార్గములను అవలంబించుచున్నది. నిద్రించువారిని లేపటము సులభము, మేలుకొన్నవారిని హెచ్చరించేది సులభం. అయితే ఊరికే పరుండి, నిద్రించునట్లు నటించేవారిని లేపటం ఎట్లా? తమోగుణము వలన జడమైన బుద్ధిగలిగిన వారిని ప్రబోధలద్వారా జాగ్రత్తపరచేది సులభం. పిచ్చిపట్టినట్లు, అల్లకల్లోలముగా అరిచేవారిని ఏ మెంటల్ హాస్పటల్‌లోనో చేర్చి శుశ్రూషించి పిచ్చి నివారణ చేయుటకు వీలున్నది. ఏ కారణమూ లేక, ఏ పిచ్చీపట్టక, ఆశలను పెంచుకొని అసూయ అహంకారములచే బాధపడువారిని ఎట్లాతీర్చిదిద్దేది? ఇట్టివారు యిప్పుడు దినదినాభివృద్ధి చెందుతున్నారు.

'సా విద్యా యా విముక్తయే'. దుఃఖమునుంచి, కామక్రోధాదులనుంచి మానవుని విద్య విడుదలచెయ్యాలి. అయితే, ఈనాటి విద్యావంతులకు శాంతి భద్రతలు లేవు. సౌఖము, సంతుష్టియూ లేవు. కలియుగములో అనేకవిధములైన సదుపాయములున్నాయి, విద్యార్జన కొరకు. వీటి వలన వివేకము పెరిగినదా? విద్యార్థుల సంఖ్య, అధ్యాపకుల సంఖ్య ఎంగానో అబివృద్ధి అయినది. ఇంక, ధనసంపాదన. కోట్లకొలదీ మార్గాలు బయలుదేరినాయి. అయితే, అన్ని దేశాలలోను మానవులు శాంతిసుఖములను నోచుకోలేక పోతున్నారు. దీనికి కాఅనమేమి? మానవుని ప్రవర్తనలో సక్రమ మార్గము లేదు. వారి నడవడికలో గుణాంశాలు లేవు.

'విద్యా తపోభ్యాం పూతాత్మా' అన్నది ఉపనిషత్తు. విద్యయందు రెండు విభాగాలున్నాయి. జీవనోపాధి నిమిత్తం అందుకోలసిన భౌతికవిద్య. జీవితపరమావధిని తెలిపి, తరింపజేసే ఆధ్యాత్మికవిద్య, లేక బ్రహ్మవిద్య. నిత్యజీవితమునకు భౌతికవిద్య అత్యవసరము. కాని, దానికనుగుణముగా ఆధ్యాత్మికవిద్యనుకూడా అభ్యసించాలి. విద్యార్థులు ఆదర్శవంతులైన ప్రజలుగా తయారు కావాలి. ఈ ఉద్యమములో గురువులయొక్క పాత్ర చాలా ప్రధానమైనది. అన్ని ఉద్యోగములకన్నా వారిదే శ్రేష్ఠమైనది. దేశముయొక్క సంతుష్టి, సౌభాగ్యము వారి సేవాదీక్షను అనుసరించియున్నది. వారి తమ ఉత్తమ ప్రబోధాలవలన, దేశమును ఉత్తమస్థాయికి తీసుకొనిపోతారు. ఒక విద్యార్థి చెడితే, వాడొక్కడే చెడును. అయితే, ఒక అధ్యాపకుడు చెడిన వేలాది పిల్లలు చెడుతారు. పిల్లలు సద్గుణవంతులుగా, త్యాగశీలురుగా, దేహభ్రాంతిలేక, మోహచింతలులేక అభివృద్ధియగుటకు విద్యార్థుల మార్గదర్శకత్వము, అనుభవపూర్వకమైన ప్రబోధ అతిముఖ్యము.

విద్యాలయములను సర్వసామాన్య దృష్టితో చూడటము జరుగుచున్నది. ఇది మంచిది కాదు. చిత్తశుద్ధిని చేకూర్చునదే విద్య. నైతిక, ధార్మిక విలువలను అభివృద్ధిపరచేది విద్య. వినయవిధేయతలను పోషించి, రక్షించునది విద్య. అట్టి విద్యను బోధించే కేంద్రములు విద్యాలయములు. ఈనాడు విద్యాలయములు విజ్ఞానశాస్త్రాభివృద్ధిని మాత్రమే గమ్యమని విశ్వసించి దానికి తగిన ప్రోత్సాహమును అందుకొనుచున్నది. విజ్ఞానమేమో పెరిగినది. కాని, మానవత్వము పెరిగినట్లు గోచరించదు. దూరమునందున్న చంద్రలోకానికి పోయివచ్చామని విఱ్ఱవీగుతున్నారేగాని ప్రత్యక్షముగా దగ్గర కనిపిస్తున్న మానవుని స్థితియేమో విచారించుటలేదు. ప్రక్కింటివాని పరిస్థితి గమనించుటలేదు. ప్రపంచములోని జ్ఞానులు నిర్విరామముగా సెమినార్లు, సమావేశములు అని కాలవ్యయము, ధనవ్యయము చేస్తారేగాని వాటివలన జనులకేమీ ఉపకారము లేదు. ప్లాట్‌ఫారంపై హీరో, దిగిన తరువాత, ప్రజల మధ్య జీరో అనే పరిస్థితి వచ్చింది. దీనిని నివారించుటకు చక్కని మార్గమేమని నిర్ణయించాలి.

విద్యామంత్రిగారు విద్యాభ్యాసక్రమమును ఉన్నతస్థాయికి ఉద్ధరించేందుకు బాలబాలికల హృదయమందు ఉన్నతాదర్శాలను నాటేందుకు సంకల్పించుకొని తగిన ఉత్సాహప్రోత్సాహములనందించే నిమిత్తమై ఈ సమావేశమేర్పరచారు. ఇది ఒక అదృష్టమైన విషయము. ఇది మహా పవిత్రదినం. భవనమునకు పునాది, వృక్షమునకు వేరు, జీవితమునకు మనస్సు, ఆ మనస్సులోని భావాలు

నిర్మల నిశ్చల నిస్వార్థముగా ఉండాలి. వ్యక్తియొక్క దేశముయొక్క భవిష్యద్భద్రత ఈ పునాదిని అనుసరించియుండును.

పిల్లలు మంచివారే. వారు పెడమార్గమును అశ్రయించుటకు అధ్యాపకులు మాత్రమేగాదు కారణము. టీచర్లు, పోలీసులు వీరిద్దరూ సక్రమముగా పనిచేసిన సమాజముయొక్క పునాది భద్రమగును అన్నారు. వారికి తోడుగా పేరెంట్సుకూడా ఉండాలి. శిక్షకులు, రక్షకులు వీరితో దక్షకులుకూడా బాధ్యతవహించాలి. నూటికి తొంభైమంది పిల్లలు తల్లిదండ్రుల వలననే పెడమార్గము పట్టుచున్నారు. అర్థముకాని ప్రేమ, మితిమీరిన స్వాతంత్ర్యమును అందించి, తమ పిల్లలను తామే పెడమార్గము పట్టించుచున్నారు. శీలమే విద్యయొక్క గమ్యమని మీరు తల్లిదండ్రులకు చెప్పాలి.

చిన్నపిల్లలకుకూడా క్రమశిక్షణ అత్యవసరం. దానిని నేర్పుతూ రావాలి. అనేకమంది విద్యాబోధకులు, విద్యాభిమానులు ఇపుడు, పిల్లల వాంఛలను మేము అనుసరించాలి, వాటికి అడ్డుచేయకూడదని వాదింతురు. ఇది పెద్ద పొరపాటు. మీకందరికీ తెలుసు. పొట్లకాయ పిందెగా ఉన్నప్పుడే చిన్న రాయి కట్టకపోతే, అది వంకరటింకరగా పెరుగును. చక్కగా పెరగదు. పెరిగేకొద్దీ, ఆ స్థాయికి తగినట్లుగా, రాయినికూడా పెద్దదిగా మార్చాలి. తొమ్మిది గంటలకు పిల్లలు పాఠశాల చేరుటకు బయలుదేరిన, వారు పాఠశాల వదలి సినీమా చూస్తున్నారా అని విచారణ చేయుటలేదు. పాఠశాల అయిన తరువాత నేరుగా ఇంటికి రాలేదని మందలించుటలేదు. అదికారుల పిల్లలు మరియు విద్యావంతుల పిల్లలే ఎక్కువ పెడమార్గములనాశ్రయింతురు. వారికే ఇంత స్వేచ్ఛగా తిరిగే అవకాశము, ప్రోత్సాహము, తమ కామపుత్రులని ఈ పిల్లలను తల్లిదండ్రులు, తమ ప్రేమపుత్రులని వారిని అధ్యాపకులూ సక్రమమార్గమున త్రిప్పుటకు తగినరీతిగా ప్రయత్నించాలి.

ఆధ్యాత్మికము లేని విద్య కృత్రిమవిద్య. ఈ రకమైన చెత్తవిద్యల వలన చిత్తము శిథిలమైపోవును. వివేకార్జనము ప్రధానముగాని, ధనార్జనము కాదని నిరూపించాలి. విద్యావంతులందరూ ఈనాడు చేతులకు మట్టి అంటకూడదు, దుస్తుల ఇస్త్రీ వదలకూడదు. ఎయిర్ కండిషన్ రూములో ఫ్యాన్ క్రింద సోఫాలో కూర్చొని సుఖంగా ఉద్యోగము చేయాలని ఆశిస్తున్నారు. ఈ భావమును నిర్మూలము చేయకున్న దేశోన్నతి లభించదు. కష్టపడి, చమటోడ్చి పనిచేయాలి. తన కాళ్లపై తాను నిలబడాలి. కర్మశీలుడు, త్యాగశీలుడు కావాలి. స్వార్థభావము పెరిగి, దాని కీలుబొమ్మగా మానవుడు వర్తించుచున్నాడు. దానివలన అసూయ అనే పిశాచము తాండవమాడుచున్నది. అహంకారమునకు అసూయ పీఠం, ప్రేమపుష్పమునకు విషపురుగు పట్టినది. కర్తవ్యమును గుర్తించే వ్యక్తులు ఎక్కడనూ కనిపించటం లేదు. అధికారమునకు ప్రాకులాడే వ్యక్తులే ఎక్కువ. కర్తవ్యమే అధికారం, దానినే అనుసరించాలి. అనుభవించి ఆనందించాలి.

జీవితముయొక్క పరమోద్దేశమేమని మానవులు గుర్తించుట లేదు. కొన్ని విషయాలలో మానవుడు అరణ్యములో నివసించే మృగములకంటే హీనం. అవి నిరంతరమూ సంతృప్తితో, సంతుష్టితో కాలము గడుపుచున్నవి. దుష్టవాంఛలు, దుర్మార్గపు వృత్తులు, దుర్భావములు వాటికి లేవు. వాటిని చూస్తూవుంటే సంతోషముగా ఉంటుంది. మానవులు తమలోని దైవత్వమును ప్రకటించి, ప్రకాశింపజేయుటకు విద్యావిధానము చక్కగా తోడ్పడాలి. మానవునికీ మనవునికీ గల సమరస సంబంధాన్ని పెంచుకోవాలి. సమచిత్తం, సహనం, త్యాగశీలము వీటిని నిలబెట్టి అభివృద్ధిచేయుటకు బాలవికాస్ పద్ధతిలో పాఠ్యక్రమాలు ప్రారంభమైనవి. ఇట్టి సద్గుణములను బోధించుటకు బాలవికాస్ సమితివారు చేసిన మూడు పుస్తకములను ఆవిష్కరణచేసే కార్యమును నాకు అప్పచెప్పారు. ఆ పుస్తకములు మస్తకములనుంచి వచ్చినవి, తరిగి మస్తకమున చేర్చక, మస్తకములోనే ఉంచక, వాటివాటిలోని సలహాలను, శిక్షణత్వములను ఆచరణలో పెట్టుటకు మీరు, అధ్యాపకులు ప్రయయత్నించాలి. చైతన్యము నైపుణ్యముగా రూపొందాలి. బుద్ధి సామర్థ్యముగా రూపొందాలి. ఈనాటి విద్య అంతా, పుస్తకములలోని విషయాలను మస్తకములో నింపుకొని పరీక్ష సమయమందు ఆన్సర్ పేపరుమీద పోసే పనితో అంతమౌతుంది. రెండవ వారం ఆ విద్యార్థికి ఆ విషయాలు ఏమీరావు. మస్తకములో చేరకూడదు. విద్య హృదయమునందు ప్రింటైపోవాలి. తలలో ప్రింటైతే అది పోలరాయిడ్ ప్రింటు. ఇంకొక కాపీ దొరకదు. కాని, చేయుటకు ప్రత్యేకమైన యంత్రము కావాలి. హృదయములో ప్రింటైతే అది నెగిటివ్. ఎన్ని కాపీలు కావలసిననూ సులభముగా తీయవచ్చు. ఎంతమందికైనా హృదయమునకు నాటేరీతిలో బోధించవచ్చు.

పిల్లలది లేత హృదయం. ఈర్ష్య, అసూయ, డంబము దీనికి చోటులేదు. వారిని మీ పిల్లలుగానే భావించి తీర్చిదిద్దండి. అటుల చేసిన మీ పిల్లలను భగవంతుడు అనుగ్రహించి కాపాడును. జీవితముయొక్క ప్రధాన సూత్రం ప్రేమయే. అందరిలోనూ భగవంతుడున్నాడు. 'బీజం మాం సర్వభూతానాం' అన్నాడు శ్రీకృష్ణుడు గీతయందు. ఒక విత్తనం నాటితే అది పెద్ద వృక్షమై వేలాది ఫలములనందించును. అయితే, నాటిన విత్తనములు మరి అన్ని కాయలలోనూ పోయి చేరుతాయి. అట్లనే, సర్వజీవులందు దేవుడున్నాడు. కర్నాటక రాజ్యమందు ప్రాథమిక విద్యాభ్యాసక్రమమును తీర్చిదిద్ది, నైతిక, ధార్మిక, ఆధ్యాత్మిక తత్త్వములను ఆచరణరూపమైన ప్రబోధలను స్థాపించుటకు విద్యమంత్రిణి శ్రీమతి నాగమ్మకేశవమూర్తి కంకణబద్ధులై నిలవటం ఒక శుభసూచన. విద్యాధికారులుకూడా ఆమోదించి వారి పవిత్రభావమును పోషించుటకు సిద్ధముగా ఉన్నారు. జలమును ఒక పాత్రనుండి మరొక పాత్రకు పోసేటప్పుడు, పై పాత్ర ఏమాత్రమూ కదలకూడదు. క్రిందనున్న పాత్రకూడా చక్కగా కదలకుండా ఉండాలి. అట్లనే,

మంత్రిగారి ఉత్సాహము శ్రద్ధ ఎంత తీవ్రమో అంత శ్రద్ధ ఉత్సాహము ఈ పద్ధతిని అమలుపరచే అధికారులలోకూడా వ్యక్తం కావాలి. అధ్యాపకులకు బాలబాలికల సేవకు, దేశసేవకు మాత్రమేకాదు లోకకల్యాణం సాధించుటకు కూడా ఇది మంచి అవకాశము. త్యాగభూమి, కర్మభూమి, యోగభూమి అని ఖ్యాతిగాంచిన భరతమాతయొక్క కీర్తిని పునరుద్ధరించుటకు మీకందరికీ ఇది ఒక పవిత్ర అవకాశం.

(1981 మే నెల 17వ తేదీ బెంగుళూరు లాల్‌బాగ్ సభామంటములో భగవాన్ బాబావారి దివ్యోపన్యాసం)